సాక్షి
తూర్పుగోదావరి

సోమవారం । 4 । నవంబర్ । 2024



విజ్ఞానానికి పట్టం

విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు కౌశల్ సైన్స్ క్విజ్ పోటీలతో పాటు పోస్టర్ పోటీలకు దరఖాస్తులు ఆహ్వాని స్తున్నారు.

8 లో



రత్నగిరిపై ట్రాన్స్‌పోర్ట్ సేవలు అదుర్స్

చాలా కాలానికి అన్నవరం దేవస్థానం ట్రాన్స్‌పోర్టు గాడిలో పడింది. దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ తీసుకున్న చర్యల కారణంగా కార్తికమాసంలో ఆదివారం ఒక్కరోజే అన్నవరం రైల్వేస్టేషన్ నుంచి రత్నగిరికి తొమ్మిది బస్సులు నడిపారు.

54 వేల క్యూసెక్కుల మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం 54,555 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి వదిలారు. బ్యారేజీ వద్ద 10.90 అడుగుల కు నీటిమట్టం చేరింది. డెల్టా కాలువలకు 8,300 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 1,100, మధ్య డెల్టాకు 1,700, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కుల నీటిని విడిచి పెట్టారు.

న్యూస్‌రీల్

ఆస్ట్రో సౌండ్ థెరపీతో వ్యాధులకు చెక్



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ నారాయణ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఆస్ట్రోసౌండ్ థెరపీతో వ్యాధులకు చెక్ పెట్టవచ్చని శ్రీరాధాకృష్ణ కళాక్షేత్ర అధ్యక్షుడు డాక్టర్ జీబీ నారాయణ అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక ఆనం కళాకేంద్రంలో ఆయన అధ్యక్షతన ఆస్ట్రో సౌండ్ థెరపీపై సెమినార్ జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ నారాయణ మాట్లాడుతూ ఇప్పటి వరకు సంగీతంతో కొన్ని రోగాలను తగ్గించవచ్చని పరిశోధకులు చెబుతున్న మాట అని, ఇకపై వారి గ్రహస్థితితో పాటు వారి రాశులకు సరిపడే స్వరాలతో థెరపీ చేయిస్తే మరింత ఉత్తమ ఫలితాలను పొందవచ్చన్నారు. ఆస్ట్రో సౌండ్ థెరఫీపై మన వారందరికీ తెలియజేయాలన్న ఉద్దేశంతో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. మ్యూజిక్ థెరపిస్ట్ జీఎల్ దీపిక పలు అంశాలపై అవగాహన కల్పించారు.

బాలాజీ ఆలయానికి కార్తిక శోభ

మామిడికుదురు: పవిత్రమైన కార్తిక మాసం ఆదివారం కావడంతో అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఆలయానికి ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. పాత గుడితో పాటు నవీన ఆలయం వద్ద భక్తులు సందడి చేశారు. గోవింద నామస్మరణతో స్వామి వారి ఆలయం మార్మోగింది. బాల తిరుపతిగా ప్రాచుర్యం పొందిన బాలబాలాజీ స్వామి వారు తన దివ్య తేజస్సుతో భక్తులకు విశేషంగా దర్శనమిచ్చారు. పవిత్ర వైనతేయ గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. స్వామి వారి అన్న ప్రసాదం స్వీకరించారు. నిత్యం జరిగే లక్ష్మీనారాయణ హోమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు. గోశాలను సందర్శించి గోవుల చుట్టూ తిరిగి ప్రదక్షిణ చేశారు. ఆలయ ఈఓ ఎం.సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. స్వామి వారికి వివిధ సేవల ద్వారా రూ.2,42,303 ఆదాయం లభించింది. 4,051 మంది భక్తులు స్వామి వారిని దర్శించుకోగా 2,639 మంది స్వామి వారి అన్న ప్రసాదం స్వీకరించారు.

అయినవిల్లిలో భక్తుల సందడి

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తులు సందడి చేశారు. స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో స్వామికి మేలుకొలుపు సేవ, పంచామృతాభిషేకం, ఏకాదశ, లఘున్యాస, రుద్రాభిషేకాలు, వివిధ ప్రత్యేక పూజలు జరిపారు. స్వామిని మహానివేదన అనంతరం వివిధ పుష్పాలతో అర్చకస్వాములు సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామివారి లఘున్యాస, ఏకాదశ రుద్రాభిషేకాల్లో 200 మంది, ఐదువురు దంపతులు లక్ష్మగరిక పూజ, లక్ష్మీగణపతి హోమంలో 17 మంది భక్త దంపతులు, 11 మంది స్వామికి ఉండ్రాళ్ల పూజ జరిపారు. 25 మందికి చిన్నారులకు తులాభారం, ఆశీర్వచనం చేశారు. స్వామికి ఐదుగురు తలనీలాలు సమర్పించారు.

నారావారి ఉత్తుత్తి దీపం

- విధి విధానాల్లేని ఉచిత సిలిండర్ల హామీ
- అధికారంలోకి వచ్చాక కొర్రీలతో కిరికిరి
- ముందుగా డబ్బులు చెల్లించాలని నిబంధన
- ఆధార్, రేషన్, గ్యాస్ లింక్ ఉంటేనే అర్హులు
- ఈకేవైసీ చేయించుకునేందుకు అవస్థలు



ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా

ఉచిత గ్యాస్ సిలిండర్లు పొందేందుకు ప్రభుత్వం వెలువరించిన మార్గదర్శకాలకు అనుగుణంగా వ్యవహరిస్తున్నాం. రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతా, గ్యాస్ బుక్ తప్పనిసరిగా ఉండాలి. వాటికి మొబైల్ నంబర్‌తో లింక్ ఉండాలి. ఈకేవైసీ ప్రక్రియను గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు నిర్వహిస్తారు. అది పూర్తయిన వెంటనే గ్యాస్ బుక్ చేసుకుంటే నిర్ణీత సమయంలో అందుతుంది.

– ప్రసాద్‌రావు, జిల్లా పౌరసరఫరాల అధికారి



సాక్షి, రాజమహేంద్రవరం: ఉచిత గ్యాస్ పథకంపై కూటమి ప్రభుత్వం నిబంధనల 'బండ' వేసింది. సార్వత్రిక ఎన్నికల ముందు ప్రతి ఇంటికీ ఏడాదికి మూడు సిలిండర్లు ఇస్తామని హామీ ఇచ్చిన తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చాక కొర్రీలు వేస్తున్నారు. అందరికీ కాకుండా కొందరికే పరిమితం చేసేందుకు కుట్ర పన్నుతున్నారు. ఈ క్రమంలో సవాలక్ష నిబంధనలు తెరపైకి తెస్తున్నారు. తొలుత దీపం పథకం ద్వారా గ్యాస్ పొందిన వారికే వర్తిస్తుందన్నారు. అనంతరం రేషన్ కార్డు కలిగిన వారికి మినహాయింపు ఇచ్చారు. ఇప్పుడేమో రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్, మొబైల్ నంబర్‌కు లింక్ అయి ఉంటే మాత్రమే ఇస్తామంటున్నారు. గ్యాస్ ఏజెన్సీల వద్ద ఈకేవైసీ తప్పనిసరి చేయడంతో వినియోగదారులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా మారుతున్నాయి. బ్యాంకు ఖాతా ఫోన్ నంబర్ బియ్యం కార్డు ఫోన్ నెంబర్ తేడా ఉంటే చెల్లించిన నగదు ఖాతాలో జమ అయ్యే పరిస్థితి లేదు. అందులోనూ గత నెల 31 తేదీ లోపు బుక్ చేసుకోవాలని ఆర్భాటంగా ప్రకటించారు. ఎలా బుక్ చేసుకోవాలి..? అన్న విషయమై స్పష్టత ఇవ్వకపోవడంతో తొలి దశలో బుక్ చేసుకున్న వారి సంఖ్య తక్కువగానే ఉంది. ఉచితంగా ఇచ్చేందుకు ఇవన్నీ ఎందుకని ప్రశ్నిస్తున్నారు. ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా పూర్తి స్థాయిలో నెరవేర్చని కూటమి ప్రభుత్వం ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను తగ్గించుకునేందుకు ప్రచార ఆర్భాటం కోసం ఉచిత గ్యాస్ ఇచ్చేందుకు సన్నద్ధమైంది తప్ప.. ప్రతి ఒక్కరికీ ఇవ్వాలన్న ఉద్దేశం ఏ మాత్రం లేదని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు.

ప్రచార ఆర్భాటం

ఉచిత గ్యాస్ సిలిండర్ల కోసం గత నెల 29వ తేదీ నుంచి హడావుడిగా బుకింగ్ ప్రారంభించారు. దీపావళి కానుకగా పథకాన్ని ప్రారంభించామని చెప్పుకొనేందుకు కూటమి ఎమ్మెల్యేలు, నేతలు కార్యక్రమాలు పెట్టి మరీ ఒక సిలిండర్ మహిళకు అందజేసేశారు. మరో పథకం అమలు చేసేశామని విస్తృతంగా ప్రచారం చేసేశారు. మిగిలిన లబ్ధిదారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గ్యాస్ కోసం నమోదు చేసుకున్న వారికి 2025 ఏప్రిల్ 1వ తేదీ నుంచి ప్రతి నాలుగు నెలలకు ఒకసారి ఓ సిలిండర్ సొమ్ము జమ చేస్తారు. ఏప్రిల్–జూలై మధ్య ఒకటి, ఆగస్టు–నవంబర్ మధ్య రెండోది, డిసెంబరు–మార్చి మధ్య మూడో సిలిండర్ చొప్పున అందిస్తారు.

జిల్లాలో మొత్తం గ్యాస్ కనెక్షన్లు	6,24,265
సాధారణ కనెక్షన్లు	2,25,394
దీపం	1,65,012
సీఎస్‌ఆర్	7,229
ఉజ్వల	6,553
5 కేజీల సిలిండర్లు	2,141
కమర్షియల్	3,405
డబుల్ కనెక్షన్లు	2,14,531

ముందు డబ్బులు చెల్లించాలి

ఉచిత గ్యాస్ ఇస్తామన్న టీడీపీ అధినేత చంద్రబాబు పథకంలో మెలిక పెట్టారు. గ్యాస్ కనెక్షన్ యాక్టివ్‌లో ఉండి బియ్యం కార్డు ఉన్న వినియోగదారులకు మాత్రమే పథకం వర్తిస్తుంది. లబ్ధిదారులు ఈకేవైసీ చేయించుకుంటేనే సిలిండర్లు ఉచితంగా అందే పరిస్థితి. గ్యాస్ సిలిండర్ బుక్ చేసిన తర్వాత సిలిండర్ తీసుకునే సమయంలో వినియోగదారులు ముందుగా డబ్బులు చెల్లించాలి. రెండు రోజుల్లో తిరిగి ఆ నగదు వినియోగదారుడి బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది. బ్యాంకు ఖాతా ఫోన్ నెంబర్, బియ్యం కార్డు ఫోన్ నంబర్ తేడా ఉంటే నగదు అందడం కష్టమే.

ఏజెన్సీల వసూళ్ల దందా..?

ఉచితంగా గ్యాస్ పొందేందుకు గ్యాస్ ఏజెన్సీల్లో ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంది. ఇదే అదునుగా భావించిన గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు వినియోగదారుల వద్ద వసూళ్ల పర్వానికి తెర తీసినట్లు ఆరోపణలున్నాయి. బలవంతంగా రెగ్యులేటర్ పైపును అంటగడుతూ వ్యాపారం చేస్తున్నట్లు తెలిసింది. రూ.200 చెల్లించి తప్పనిసరిగా పైపు తీసుకోవాలని లేకుంటే ఈకేవైసీ చేయబోమని వినియోగదారులపై ఒత్తిడి చేస్తున్నారు. తమ సిలిండర్ పైప్ బాగుందని చెబుతున్నా పట్టించుకోవడం లేదు. దీనికి తోడు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని మరో రూ.200 వరకు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ఏజెన్సీల ఒత్తిడితో వినియోగదారులు చెల్లించక తప్పని పరిస్థితి ఏర్పడింది. రోజుకు ఎన్ని ఈకేవైసీలు చేస్తున్నారన్న సమాచారం సైతం అధికారులకు ఇవ్వడం లేదు.

రేషన్ కార్డు లేని వారి పరిస్థితేంటో..?

ఉచిత గ్యాస్ పొందాలంటే రేషన్ కార్డు తప్పనిసరి చేశారు. జిల్లా వ్యాప్తంగా 3 ప్రధాన కంపెనీలు, 36 ఏజెన్సీల ద్వారా గ్యాస్ సరఫరా జరుగుతోంది. బీపీసీఎల్ ద్వారా 37,007, ఐఓసీఎల్ ద్వారా 1,26,793, హెచ్‌పీసీఎల్ కంపెనీ పరిధిలో 4,60,465 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 6,24,265 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో డబుల్ కనెక్షన్లు మినహా ఇస్తే.. 4,09,734 ఉన్నాయి. తెల్లరేషన్ కార్డులు 5,42,964, అంత్యోదయ కార్డులు 21,591 కలిపి మొత్తం 5,64,555 ఉన్నాయి. రేషన్‌కార్డు నిబంధనతో జిల్లాలో 57,000 మందికి గ్యాస్ అందే పరిస్థితి లేదు. వీరి పరిస్థితి ఏంటన్నది అంతుచిక్కని ప్రశ్నగా మారింది. ఎన్నికల ప్రచారంలో ప్రతి ఇంటికీ గ్యాస్ అని డప్పు కొట్టి ఇప్పుడు షరతులు పెట్టడంపై వినియోగదారులు మండిపడుతున్నారు.

9న వలంటీర్ల చలో విజయవాడ

జిల్లా వలంటీర్స్ అసోసియేషన్ చైర్మన్ సత్తిబాబు పిలుపు



వలంటీర్ల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అసోసియేషన్ చైర్మన్ సత్తిబాబు

అమలాపురం టౌన్: గ్రామ, వార్డు సచివాలయాల పరిధుల్లో క్షేత్ర స్థాయిలో ప్రజలకు సేవలు అందించిన వలంటీర్లు ఈనెల 9న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా వలంటీర్స్ అసోసియేషన్ చైర్మన్ కె.సత్తిబాబు తెలిపారు. అదే రోజు విజయవాడలోని సీపీఐ కార్యాలయ ప్రాంగణంలో జరగనున్న వలంటీర్ల ఆవేదన సదస్సులో తమ సమస్యల పరిష్కారం, ప్రభుత్వ హామీలు అమలు చేయాలన్న డిమాండ్లతో ఈ సదస్సు జరుగుతుందన్నారు. ఏఐవైఎఫ్ అనుబంధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వలంటీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరగనున్న చలో విజయవాడ, ఆవేదన సదస్సు కార్యక్రమాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యంగా సీఎం చంద్రబాబుకు ఎన్నికల్లో వలంటీర్లకు హామీ ఇచ్చినట్లుగా నెలకు రూ.10 వేల గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేయనున్నారని సత్తిబాబు తెలిపారు. అలాగే వలంటీర్లను కొనసాగిస్తామన్న హామీని అమలు చేసి, బకాయి పడ్డ గత అయిదు నెలల గౌరవ వేతనాలను ఇవ్వాలని పట్టుబట్టనున్నారని చెప్పారు. ముఖ్యంగా తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరనున్నారని జిల్లా చైర్మన్ సత్తిబాబు స్పష్టం చేశారు. స్థానిక ఉపాధ్యాయ సంఘం భవనంలో వలంటీర్ల సంఘాల ముఖ్య నాయకులతో ఆదివారం జరిగిన సమావేశంలో చలో విజయవాడ కార్యక్రమంపై సత్తిబాబు చర్చించారు. వలంటీర్ల సంఘం ప్రతినిధి వరదా వెంకటానంద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం చలో విజయవాడ, ఆవేదన సదస్సుకు జిల్లా నుంచి వలంటీర్లు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిస్తూ తీర్మానించింది.

కార్తిక దీపోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



ద్రాక్షారామలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీ సుభాష్ చంద్రబోస్

రామచంద్రపురం రూరల్: ప్రసిద్ధి చెందిన ద్రాక్షారామ ప్రసన్నాంజనేయ స్వామి కార్తిక దీపారాధన మహోత్సవాలకు ఆదివారం రాట ముహూర్తం జరిగింది. మాణిక్యాంబా సమేత భీమేశ్వరాలయ ప్రాంగణంలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద దాత సత్తి సుబ్బారెడ్డి, ఆయన కుమారుడు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సత్తి సత్తిరెడ్డి చేతుల మీదుగా ఈ కార్యక్రమం నిర్వహించారు. జుత్తుక చిన్నా బ్రహ్మత్వంలో ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్‌చంద్రబోస్ చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీలు నరాల రాజ్యలక్ష్మి, శాకా బాబీ, ఎంపీటీసీ రెడ్నం సతీష్, సర్పంచ్‌లు, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, నియోజకవర్గ శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు నరాల ఏడుకొండలు, కమిటీ అధ్యక్షుడు బోనం శ్రీనివాసరావు, కోశాధికారి చక్కా రాజు, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

దళితులపై దాడులు అరికట్టాలి



దళితులపై జరుగుతున్న దాడులపై మాట్లాడుతున్న కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాల్యాద్రి

అమలాపురం టౌన్: రాష్ట్రంలో దళితులు, గిరిజనులపై జరుగుతున్న దాడులు, అఘాయిత్యాలను తక్షణమే అదుపు చేయాలని జిల్లా కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రౌండ్ టేబుల్ సమావేశం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. స్థానిక జిల్లా సీఐటీయూ కార్యాలయంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సమావేశం ఆటవికంగా జరుగుతున్న దాడులు, అఘాయిత్యాలపై ఆందోళన వ్యక్తం చేసింది. కేవీపీఎస్ జిల్లా కన్వీనర్ శెట్టిబత్తుల తులసీరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మల్యాద్రి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. జిల్లాలోని మండపేటలో దళితులపై జరిగిన దాడిని సమావేశం తీవ్రంగా ఖండిస్తూ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీల సమావేశాలను అధికారులు తరచూ నిర్వహించకపోవడం వల్లే ఇలాంటి దాడులు, అఘాయిత్యాలు భయం అనేది లేకుండా జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో ఉన్న ఈ కమిటీల సమావేశాలను అధికారులు విధిగా నిర్వహించాలని డిమాండ్ చేసింది. ఈ సమావేశాల నిర్వహణ ద్వారా దళితులకు ఓ భరోసా ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో ఇటీవల కుల వివక్షతో కూడిన కుల అహంకార దాడులు విచ్చలవిడిగా జరుగుతున్నాయని, ఈ విషయంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వక్తలు తమ ప్రసంగాల్లో విమర్శించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కారెం వెంకటేశ్వరరావు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, పౌర హక్కుల వేదిక నాయకుడు అమలదాసు బాబూరావు, బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పాలమూరి మోహన్‌బాబు, మాల మహానాడు నాయకుడు గెల్లా రాజేందర్, న్యాయవాది వై.సత్యనారాయణ దళితులపై ఓ పథకం ప్రకారం జరుగుతున్న దాడులపై ప్రసంగించారు.

సక్సెస్ మంత్ర రోల్ మోడల్

సాక్షి ఇంటర్వ్యూ

- గ్రూప్–1లో రాష్ట్రస్థాయిలో ప్రథమం
- గవర్నర్ నుంచి స్వర్ణ పతకం
- రాష్ట్రపతి కలాం నుంచి యంగ్ అచీవర్స్ అవార్డు
- కల్యాణదుర్గంలో ఆర్డీఓగా పనితీరుకు ఐఎస్ఓ గుర్తింపు
- కొవ్వూరును అదే స్థాయిలో నిలుపుతా
- ఆర్డీవో రాణి సుస్మిత



రాణి సుస్మిత, ఆర్డీఓ, కొవ్వూరు

కొవ్వూరు: ప్రజలకు మెరుగైన సేవలందించి కొవ్వూరు డివిజన్‌ను రోల్‌మోడల్‌గా తయారు చేసేందుకు ప్రయతిస్తానని ఆర్డీవో రాణి సుస్మిత చెప్పున్నారు. శనివారం ఆమె సాక్షితో ముచ్చటిస్తూ తాను కాకినాడ జిల్లా పిఠాపురం వాసినని ప్రాథమిక విద్యాభ్యాసం అంతా ఆ జిల్లాలోనే సాగిందని పేర్కొన్నారు. చిన్ననాటి నుంచి చదువుతో పాటు ఉద్యోగ ధర్మం నిర్వర్తించడంలో తనదైన ముద్రతో సాగిపోతూ ఆమె సాధించిన విజయాలను పంచుకున్నారు.

మీ కుటుంబ నేపథ్యం?

మా స్వస్థలం పిఠాపురం. కుంతిమాధవ స్వామి గుడి వీధి. నాన్న శ్రీనివాస్ సెంట్రల్ సిల్క్ బోర్డు ఉద్యోగి. అమ్మ పద్మప్రియ. ప్రైవేటు స్కూలు టీచర్. చెల్లి శృతి గృహిణి. భర్త కాంభట్ల వెంకట రవికాంత్ ప్రైవేటు సంస్థలో కేరళలో సౌత్ రీజియన్ హెడ్‌గా పనిచేస్తున్నారు. రెండేళ్ల కుమారుడు సురవ్ కాశ్యప్ ఉన్నారు.



ఉమ్మడి రాష్ట్ర గవర్నర్ నరసింహన్ నుంచి గోల్డ్ మెడల్ అందుకుంటున్న రాణి సుస్మిత(ఫైల్)

విద్యాభ్యాసం ఎలా సాగింది?

ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకు పిఠాపురంలో ప్రియదర్శిని రెసిడెన్షియల్ స్కూలు, ఇంటర్మీడియెట్ కాకినాడ ఆదిత్యలో, డిగ్రీ బీఎస్సీ వీఎస్ఎల్ విమెన్స్ కళాశాలలో సాగింది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో 2008–10లో హెల్త్ కేర్ అండ్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ చేశాను. పీజీలో ఉత్తమ ఫలితాలు సాధించి నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ నరసింహన్ నుంచి స్వర్ణ పతకం అందుకున్నాను. పీజీలో టాపర్‌గా నిలిచి రాష్ట్రపతి అబ్దుల్ కలాం నుంచి యంగ్ అచీవర్స్ పురస్కారాన్ని అందుకున్నాను. కేరళలో తిరుచ్చి నిట్‌లో హెల్త్ కేర్ అండ్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ (క్వాలిటీ అండ్ అసెస్‌మెంట్స్ విభాగం)లో పీహెచ్‌డీ చేశాను. అనంతరం ఐదు రీసెర్చ్ పుస్తకాలు రాశాను. అలాగే యాభైకి పైగా ప్రయోగాలు జాతీయ, అంతర్జాతీయ పత్రికల్లో ప్రచురితమయ్యాయి.



రాష్ట్రపతి అబ్దుల్ కలాం చేతుల మీదుగా యంగ్ అచీవర్స్ అవార్డు అందుకుంటూ.. (ఫైల్)

ఉద్యోగ ప్రస్థానం ఎలా?

బెంగళూర్‌లో బీఎస్‌బీఎస్–బీ స్కూలు (బిజినెస్ స్కూలు)కి అకడమిషన్ ప్రిన్సిపాల్‌గా ఐదేళ్లు పని చేశాను. ఆ సమయంలోనే సివిల్స్ రాశాను. మెయిన్స్, ఇంటర్వ్యూల వరకు వెళ్లి చేజార్చుకున్నాను. అనంతరం అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఐఎస్‌సీఐ)లో ప్రొఫెసర్‌గా పని చేశా. రెవా యూనివర్సిటీలో, వెర్టికల్ హెడ్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ అడ్మినిస్ట్రేషన్స్‌లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేశాను. 2022లో గ్రూపు–1లో మొదటి ర్యాంకు సాధించా. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం ఆర్డీవోగా మొదటి పోస్టింగ్ వచ్చింది. అక్కడ నా సేవలకు గుర్తింపుగా ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్(ఐఎస్‌వో) నుంచి సర్టిఫికెట్ పొందాను. కొవ్వూరు డివిజన్‌ను రాష్ట్రంలో ఒక రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతా.



సాధించిన పతకాలు, జ్ఞాపికలు, అవార్డులతో రాణి సుస్మిత

మీకు ఎవరు స్ఫూర్తి?

మా తాతయ్య పేరి లక్ష్మీనరసింహశర్మ. ఆయన హిందీ టీచర్. ఆయన ప్రోత్సాహంతో చిన్ననాటి నుంచి వక్తృత్వం, వ్యాసరచన వంటి పోటీల్లో పాల్గొనేదాన్ని. సివిల్స్ అధికారిగా స్థిరపడాలనేది ఆయన కోరికే.

ప్రజా సమస్యలపై ఎలా స్పందిస్తారు?

ప్రతి సోమవారం తీసుకునే ఫిర్యాదులను మండల స్థాయిలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నాం. అక్కడ పరిష్కారం కాకపోతేనే డివిజన్ స్థాయిలో పరిష్కరిస్తున్నాం.

ఇసుక రవాణాలో సమస్యలపై..

లోకల్, నాన్ లోకల్ సమస్యను అధిగమించేందుకు వేర్వేరుగా బిల్లులు అందిస్తున్నాం. అక్రమంగా రవాణాకు ఆస్కారం లేకుండా తనిఖీలు చేస్తున్నాం. ఒకటి రెండు రోజుల్లో నేరుగా గ్రామ సచివాలయాల ద్వారా అలాట్ చేసే అవకాశం కల్పిస్తున్నాం.

భక్తులతో రత్నగిరి కిటకిట

- కొనసాగుతున్న భక్తుల రద్దీ
- 50 వేల మంది సందర్శన
- రూ.50 లక్షల ఆదాయం
- 4 వేల వ్రతాల నిర్వహణ



రూ.రెండువేల వ్రత మండపంలో సత్యదేవుని వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

అన్నవరం: రత్నగిరీశుడు సత్యదేవుని ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వేల సంఖ్యలో భక్తులు స్వామివారి దర్శనానికి రావడంతో ఆలయ ప్రాంగణం, వ్రత మంటపాలు, విశ్రాంతి మంటపాలు కిక్కిరిసిపోయాయి. 50 వేల మంది స్వామివారిని దర్శించగా నాలుగు వేల వ్రతాలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.50 లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. సత్యదేవుని ఆలయాన్ని తెల్లవారుజాము రెండు గంటలకు తెరిచి భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతించడంతో పాటు, వ్రతాలు కూడా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది. స్వామివారి వ్రతమంటపాలతో పాటు పాత కల్యాణ మండపంలో కూడా స్వామివారి వ్రతాలు నిర్వహించారు. స్వామివారి దర్శనానికి రెండు గంటలు, రూ.200 టిక్కెట్ దర్శనానికి గంట సమయం పట్టింది. స్వామి వారిని దర్శించిన భక్తులు సప్త గోకులంలోని గోవులకు ప్రదక్షిణ చేశారు. తూర్పు రాజగోపురం ముందు గల రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించారు.

కార్తికమాసంలో తొలి సోమవారం కావడంతో సత్యదేవుని ఆలయానికి భక్తులు భారీగా తరలివస్తారనే అంచనాతో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం తెల్లవారుజామున ఒంటి గంట నుంచి సత్యదేవుని వ్రతాలు, దర్శనాలకు భక్తులను అనుమతించడానికి ఏర్పాట్లు చేశారు. సత్యదేవుని ఆలయానికి సుమారు 60 వేలకు పైగా భక్తులు విచ్చేస్తారనే అంచనాతో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామివారి వ్రతాలు ఐదు వేలకు పైగా జరిగే అవకాశం ఉందని అంచనా వేస్తూ ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు.



సత్యదేవుని ఆలయం వద్ద భక్తుల రద్దీ

క్లుప్తంగా

టీడీపీ నాయకుడి ఇంట్లో జూదరుల అరెస్ట్

తుని రూరల్: తుని మండలం కేఓ.మల్లవరంలో టీడీపీ నాయకుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సుర్ల బోడయ్య ఇంట్లో పేకాడుతున్న ఏడుగురు అరెస్టు అయ్యారు. ఆదివారం అందిన సమాచారంతో రూరల్ ఎస్సై బి.కృష్ణామాచారి ఆధ్వర్యంలో పోలీసులు బోడయ్య ఇంటిపై ఆకస్మిక దాడి చేశారు. బోడయ్య సహా పేకాడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్టు ఎస్సై తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.19,460 నగదు, రెండు టేబుళ్లు, కుర్చీలను స్వాధీనం చేసుకున్నట్టు ఆయన తెలిపారు. కేసు నమోదు చేశామన్నారు. పేకాట, జూదం, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా శిక్షార్హులని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వరకట్న వేధింపులపై మహిళ ఫిర్యాదు

ముమ్మిడివరం: పుట్టింటి నుంచి అదనపు కట్నం తీసుకురమ్మని భర్త, అత్తమామలు వేధింపులకు గురిచేస్తున్నారని ముమ్మిడివరం మండలం లంక ఆఫ్ ఠానేలంకకు చెందిన ఒక మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. లంకాఫ్ ఠానేలంకకు చెందిన కర్రి స్వామి కుమార్తె ముత్యాలుకు 2011 ఫిబ్రవరి 5న కరీంనగర్ జిల్లా రామ్‌నగర్‌కు చెందిన శీలం సందీప్‌తో వివాహం జరిగింది. వివాహ సమయంలో రూ.రెండు లక్షల నగదు ఇతర లాంఛనాలు పుట్టింటివారు ఇచ్చారు. వారి కాపురం ఏడు సంవత్సరాలు సజావుగానే జరిగిందని తమకు ఒక అబ్బాయి, ఒక అమ్మాయి ఉన్నారని ఇటీవల భర్త వ్యసనాలకు బానిసై పుట్టింటి నుంచి అదనంగా కట్నం తీసుకురమ్మని వేధింపులకు గురిచేస్తున్నాడన్నారు. దీనిపై కరీంనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా భర్త అత్తమామలలో ఎటువంటి మార్పులు రాకపోవడంతో పుట్టింటికి వచ్చేశానన్నారు. అయితే ఇటీవల తన భర్త తన ఇంటికి వచ్చి కొద్దిరోజులు తనతో కాపురం సాగించి మళ్లీ వేధింపులకు గురిచేసి కరీంనగర్ వెళ్లిపోయాడని తాను వ్యవసాయ పనులు చేసుకుని పిల్లలను పోషించుకుంటున్నానని తనకు అక్రమ సంబంధం అంటగట్టి శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నాడన్నారు. తనకు న్యాయం చేయాలని ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు ముమ్మిడివరం ఎస్సై డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

కొత్తపేట: మండలంలోని అవిడి గ్రామానికి చెందిన దువ్వ చంద్రశేఖర్ (43) ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై జి.సురేంద్ర తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం చంద్రశేఖర్ అవిడి గ్రామ పంచాయతీ స్వీపర్‌గా పని చేసేవాడు. అతడిని 2023లో విధుల నుంచి తొలగించారు. అప్పటి నుంచీ స్థానిక నాయకులు, అధికారులను కలిసినప్పటికీ ఉద్యోగం రాలేదు. దీంతో మనస్తాపం చెంది శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై మృతుని కుమారుడు ప్రవీణ్ ఫిర్యాదుతో ఎస్సై మృతదేహాన్ని పరిశీలించి, పీఎం నిమిత్తం కొత్తపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

విజ్ఞానానికి పట్టం

- కౌశల్ పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం
- 8, 9, 10 తరగతులకు అవకాశం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు కౌశల్ సైన్స్ క్విజ్ పోటీలతో పాటు పోస్టర్ పోటీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. భారతీయ విజ్ఞాన మండలి (బీవీఎం), సైన్స్ సిటీ ఆంధ్రప్రదేశ్, విద్యాశాఖ సంయుక్తంగా ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీలకు ప్రకటన విడుదలైంది. ఎనిమిది, తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు మూడు దశల్లో ఈ పోటీలు నిర్వహిస్తారు. నవంబర్ 15లోపు డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.బీవీఎంఏపీ.ఓఆర్‌జీ వెబ్ సైట్‌లో నమోదు చేసుకోవాలి.


కౌశల్ పోటీల పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఈఓ, ఇతర అధికారులు

ఎవరు పాల్గొనవచ్చంటే..

- క్విజ్ పోటీలకు 8, 9, 10 నుంచి ప్రతి తరగతి నుంచి ముగ్గురు పాల్గొనాలి.
- పోస్టర్–1 పోటీల్లో (8వ తరగతి విద్యార్థులు)
- పోస్టర్–2 పోటీల్లో 9 నుంచి ఇద్దరు విద్యార్థులు పాల్గొనవచ్చు. పదో తరగతి నుంచి ఇద్దరు విద్యార్థులు షార్ట్‌ఫిల్మ్స్, రీల్స్ పోటీల్లో పాల్గొనవచ్చు. అన్ని పోటీల్లో పాఠశాల, జిల్లా స్థాయి పోటీలు ఆన్‌లైన్‌లో నిర్వహించి రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారు. తరగతికి ఐదుగురు చొప్పున మూడు తరగతులకు కలిపి 15 మందికి మాత్రమే అవకాశం ఉంటుంది.

టాపిక్: రీసైక్లింగ్ ఆఫ్ వేస్ట్ మెటీరియల్ లేదా బయోడైవర్సిటీ అండ్ సాయిల్ హెల్త్,
పోస్టర్–2 విజ్ఞాన శాస్త్ర రంగంలో భారతీయ కృషి, జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన వారు రాష్ట్ర స్థాయిలో ప్రదర్శించాలి.
అంశం: సీవీ రామన్ లైఫ్ అండ్ కాంట్రిబ్యూషన్స్ లేదా ఇండియన్ సైంటిఫిక్ అచీవ్‌మెంట్స్
జిల్లా స్థాయి పరీక్షల సిలబస్ (పదో తరగతి గణితం, విజ్ఞానశాస్త్రం, పీఎస్ అండ్ ఎన్ఎస్, సాంఘిక శాస్త్రం(జియోగ్రఫీ అండ్ భారత్ దర్శన్) విజ్ఞాన శాస్త్ర రంగంలో భారతీయుల కృషి గురించి ప్రదర్శించాల్సి ఉంటుంది. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపిన వారికి గవర్నర్ బహుమతులు అందజేస్తారు.

రిజిస్ట్రేషన్‌కు గడువు: నవంబర్ 15వ తేదీ
పాఠశాల స్థాయి స్క్రీనింగ్ ఆన్‌లైన్ పరీక్ష: నవంబర్ 20, 21, 22 తేదీల్లో
జిల్లా స్థాయి పరీక్ష ఆన్‌లైన్: డిసెంబర్ 6
జిల్లా స్థాయి పరీక్షకు అర్హులు: పాఠశాల స్థాయిలో జరిగే పరీక్షలో మొదటి 20 స్థానాలు గెలుపొందిన వారు.
రాష్ట్ర స్థాయి పరీక్షకు అర్హులు: జిల్లా స్థాయి పోటీల్లో మొదటి, రెండు స్థానాలు పొందిన 8, 9, 10 తరగతుల విద్యార్థులు

చక్కని వేదిక..


విద్యార్థుల ఐక్యూ పెంచడానికి కౌశల్ పోటీలు మంచి వేదికగా నిలుస్తాయి. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. ప్రతి పాఠశాల నుంచి టీమ్ వచ్చేలా సంబంధిత ప్రధానోపాధ్యాయులు చొరవ చూపాలి.
– పిల్లి రమేష్, డీఈఓ, కాకినాడ

ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి


మేధస్సును, సామర్థ్యాలను వెలికి తీయడానికి కౌశల్ పోటీలు చాలా ఉపయోగకరం. జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించే ఈ పోటీల్లో విజేతలకు ప్రశంసాపత్రం, జ్ఞాపిక, నగదు బహుమతులు ఉంటాయి. ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రతిభను గుర్తించి ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి.
– కేసరి శ్రీనివాసరావు, కో–ఆర్డినేటర్

పోటీలను సద్వినియోగం చేసుకోవాలి


విద్యార్థులు ఈ పోటీలను సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను వెలికితీయాలి. ఇతర పాఠశాలల విద్యార్థులతో కలసి పోటీల్లో పాల్గొనడం ద్వారా మీలో ఉన్న శక్తిసామర్థ్యాలు తెలుస్తాయి.
– ఎం.శ్రీనివాస్ వినీల్, జిల్లా సైన్స్ అధికారి, కాకినాడ

ప్రత్తిపాడులో మహిళ హత్య


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ప్రత్తిపాడు సీఐ సూర్యఅప్పారావు

ప్రత్తిపాడు: స్థానిక జాతీయ రహదారిపై పోలవరం ఎడమ కాలువ సమీపాన సుమారు 40 ఏళ్ల వెంకటలక్ష్మి అనే మహిళ హత్యకు గురైంది. ఈ ఉదంతం ఆదివారం వెలుగులోకి వచ్చింది. స్థానిక పోలీసుల కథనం మేరకు కేడీ పేటకు చెందిన ఈమె సుమారు ఎనిమిదేళ్ల క్రితం మండలంలోని ఒమ్మంగి గ్రామంలో స్థిరపడింది. ఒమ్మంగి గ్రామానికి చెందిన పి.అర్జునుడు అనే వ్యక్తితో సహజీవనం చేస్తోంది. ఈమె రక్తపు గాయాలతో పడి ఉంది. గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. సంఘటన స్థలాన్ని ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు పరిశీలించారు. మృతదేహాన్ని శవపరీక్షకై స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. ప్రత్తిపాడు వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


ఉంద్రు సతీష్ (ఫైల్)

ఉప్పలగుప్తం: కూలి పనికి వెళ్లి పనులు నిర్వహిస్తుండగా విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోయిన సంఘటన మండలంలో చినగాడవిల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఉప్పలగుప్తం ఎస్సై రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం చినగాడవిల్లి గ్రామానికి చెందిన ఉంద్రు సతీష్ (28) శనివారం సాయంత్రం కొబ్బరికాయలు లోడు చేసేందుకు జట్టు పనికి వెళ్లాడు. చినగాడవిల్లి సోమాలమ్మ డిబ్బీ ప్రాంతంలో లారీకి కొబ్బరికాయలను లోడు చేస్తుండగా పని ప్రదేశంలో లారీపై ఉన్న 11 కేవీ వైరు తగిలి విద్యుత్ షాక్ గురయ్యాడు. అపస్మారక స్థితిలో ఉన్న సతీష్‌ను స్థానికులు హుటాహుటిన అమలాపురం కిమ్స్‌కు తరలించారు. అయితే సతీష్ అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజేష్ తెలిపారు. మృతుడుకి తల్లి, తండ్రి, సోదరి ఉన్నారు. కుటుంబానికి ఆసరా ఉండవలసిన కొడుకు కళ్ల ముందే విగతజీవిగా దర్శనమివ్వడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

కొవ్వూరు: జాతీయ రహదారిపై దేచెర్ల గ్రామ సమీపంలో ఆదివారం బైక్‌ను కారు ఢీకొట్టిన ప్రమాదంలో రాజమహేంద్రవరం సీతంపేట ప్రాంతానికి చెందిన వాడపల్లి మాణిక్యాలరావు (60) దుర్మరణం పాలయ్యాడు. మాణిక్యాలరావు, కడియం గోవిందరాజులు యాక్టివాపై వెళుతుండగా హైవేలో దేచెర్ల సమీపాన క్రెటా కారు ఢీకొట్టింది. దీంతో ఇరువురు తీవ్ర గాయాలపాలయ్యారు. మాణిక్యాలరావును ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందగా గోవిందరాజు తీవ్ర గాయాల పాలయ్యారు. గోవిందరాజును రాజమహేంద్రవరం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఏ విధమైన ఫిర్యాదు అందలేదని రూరల్ పోలీసులు తెలిపారు. మాణిక్యాలరావు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ కేసుకి సంబంధించి పూర్తి వివరాలు అందాల్సి ఉంది.

ట్రాక్టర్ ఢీకొని..


వీధి శ్రీను (ఫైల్)

రావులపాలెం: రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని లక్ష్మీపోలవరం జంక్షన్ వద్ద ఆదివారం జరిగిన ప్రమాదంలో ట్రాక్టర్ ఢీకొని బైక్‌పై వెళ్తున్న వీధి శ్రీను (51) అక్కడికక్కడే మృతి చెందాడు. కపిలేశ్వరపురం మండలం కేదార్లంకకు చెందిన వీధి శ్రీను అరటిగెలల లోడు తొక్కుతూ జీవనం సాగిస్తున్నాడు. దీనిలో భాగంగా అరటి చేల నుంచి మార్కెట్‌కు గెలలను తరలించేందుకు వెళుతుండగా ట్రాక్టర్ ఢీకొని మృతి చెందాడు. దీంతో మృతుని కుటుంబానికి న్యాయం చేయాలంటూ సహచర కార్మికులు కొంతసేపు సంఘటన ప్రాంతంలో ధర్నా చేశారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. జరిగిన ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు టౌన్ సీఐ ఎం.శేఖర్‌బాబు తెలిపారు.

ముగిసిన అక్నూ కబడ్డీ జట్ల ఎంపికలు


ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికైన అక్నూ కబడ్డీ జట్టు

- రాత్రి వరకూ కొనసాగిన ఎంపికలు
- యూనివర్సిటీ జట్టుకు 12 మంది ఎంపిక

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఆదికవి నన్నయ యూనివర్సిటీ మహిళల కబడ్డీ పోటీలు, ఎంపికలు కాకినాడ పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం రాత్రితో ముగిశాయి. యూనివర్శిటీ షెడ్యూలు ప్రకారం శని, ఆదివారంలో నిర్వహించాల్సి ఉండగా 14 టీంలు రావడంతో శనివారం రాత్రి 11 గంటల వరకు ఎంపికలు నిర్వహించి సెలక్షన్ కమిటీ ఆమోదం మేరకు టీంను ఎంపిక చేసినట్లు పీఆర్ డిగ్రీ కళాశాల పీడీ రమణ తెలిపారు. తూర్పు, పశ్చిమ జిల్లాలకు నిర్వహించిన ఈ ఎంపికలకు యూనివర్శిటీ పరిశీలకులుగా ఏఎస్‌డీ డిగ్రీ కళాశాల పీడీ డాక్టర్ ప్రమీల రాణి, సెలక్షన్ కమిటీ సభ్యులుగా సాయి రిటైర్డ్ కబడ్డీ కోచ్ పీవీఎస్‌వీ సాయిప్రసాద్, పీవీవీ లక్ష్మి వ్యవహరించారు. ఈ ఎంపికల్లో గొల్లల మామిడాడ డీఆర్‌కే వ్యాయామ కళాశాల జట్టు ప్రథమస్థానం, ఏలూరు సెంట్‌థెరిసా వుమెన్స్ కళాశాల జట్టు రెండో స్థానం, పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కాకినాడ జట్టు మూడోస్థానంలో నిలిచాయి. తమిళనాడులోని అలగప్పా యూనివర్శిటీలో ఈనెల 26 నుంచి 30 వరకు జరిగే సౌత్ ఇండియా ఇంటర్ యూనివర్శిటీ పోటీల్లో అక్నూ జట్టు పాల్గొంటుందని పీఆర్‌జీ డిగ్రీ కళాశాల పీడీ రమణ ఆదివారం తెలిపారు. విజేతలకు పీఆర్ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల ప్రతినిధి కర్రిభామిరెడ్డి కప్‌లను అందజేశారు.

అక్నూ కబడ్డీ జట్టు ఇదే..
టి.అపరంజిత, జి.ఉమామహేశ్వరి, ఎస్.ఆదిలక్ష్మి, ఎం.అరుణ, ఎస్.రాజా నాగమణి, ఆశా, పి.పరిమళ, టి.రసిక, పి.జోషిత, పి.కావ్యశ్రీ, బి.హారిక, జి.దేవిలు ఎంపికైన వారిలో ఉన్నారు.

సాగిపాడులో రూ. 22 లక్షల దోపిడీ


సాగిపాడులో దోపిడీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న క్లూస్ టీం పోలీసులు

గోపాలపురం: మండలంలోని దొండపూడి పంచాయతీ పరిధిలోని సాగిపాడులో దారుణం చోటు చేసుకుంది. ఈ సంఘటన శనివారం అర్ధరాత్రి జరిగినట్లు ఎస్సై కర్రి సతీష్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం సాగిపాడు గ్రామానికి చెందిన వ్యాపారి భమిడిపాటి శ్రీనివాస్ ఇంటిలో గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి ఇంటిలో ఉన్న తన భార్య శారద, అత్తగారైన గరిమెళ్ల సూర్యకాంతంలను తీవ్రంగా కొట్టి తాళ్లతో కట్టివేశారు. ఇంటిలో ఉన్న సుమారు 30 కాసుల బంగారం, వెండి వస్తువులు, రూ.6 లక్షల నగదు దుండగులు ఎత్తుకుపోయినట్లు తెలిపారు. వాటి విలువ సుమారు రూ.22 లక్షలు ఉంటుందన్నారు. శ్రీనివాస్ రెండో కుమార్తెను హైదరాబాద్ బస్సు ఎక్కించడానికి కొయ్యలగూడెం వెళ్లడాన్ని గమనించిన దుండగులు ఈ దారుణానికి పాల్పడినట్లు తెలిపారు. దుండగులు మొహానికి మాస్కులు, చేతికి గ్లౌజులు ధరించడంతో పాటు టోపీలు పెట్టుకుని వచ్చినట్లు బాధితురాలు శారద, సూర్యకాంతంలు తెలిపారు. గాయపడ్డ తల్లీకూతుళ్లను స్థానికులు రాజమహేంద్రవరం తరలించినట్లు చెప్పారు. బాధితురాలు భమిడిపాటి శారద ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి వేలిముద్ర నిపుణులు, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం స్వాధీనం

పెదపూడి: అనపర్తి, ద్వారపూడి గ్రామాల మధ్య ద్వారపూడి సమీపంలో రైల్వే ట్రాక్ వద్ద గుర్తు తెలియని ఒక మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నామని రాజమహేంద్రవరం జీఆర్‌పీ ఎస్సై కె.మావుళ్లు ఒక ప్రకటనలో ఆదివారం తెలిపారు. రైలు ఢీకొట్టడంతో మృతుని శరీరం నుజ్జునుజ్జయిందన్నారు. రెండు కాళ్లు శరీరం నుంచి వేరు పడి ఉన్నాయి. ఎడమ చేయి శరీరం నుంచి వేరుగా తెగిపడి ఉంది. మృతుని వయసు 48 ఉంటుంది. సిమెంటు రంగు ఫ్యాంట్, తెలుపు రంగుపై సిమెంట్ రంగు చారల షర్ట్, తెలుపురంగు కట్ బనియన్, తెలుపు, ఎరుపు, నీలం గడుల రుమాలు ధరించాడన్నారు. మృతుని వివరాలు తెలిస్తే రాజమహేంద్రవరం జీఆర్పీ పీఎస్ నంబర్ 08832442821, ఎస్సై నంబర్ 9191003239కు కాల్ చేయాలని తెలిపారు.

పెట్రోల్ బంకులో అగ్ని ప్రమాదం

- లారీ నుంచి అకస్మాత్తుగా చెలరేగిన మంటలు
- భయంతో పరుగులు తీసిన జనం
- త్రుటిలో తప్పిన పెను ప్రమాదం


లారీ నుంచి వ్యాపిస్తున్న మంటలు


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రాజానగరం: మండలంలోని దివాన్‌చెరువు ఇండియన్ ఆయిల్ పెట్రోలు బంకులో డీజిల్ నింపుకుంటున్న లారీ నుంచి ఆకస్మాత్తుగా మంటలు వ్యాపించాయి. దీంతో అక్కడ ఉన్న ఇతర వాహన దారులు, సిబ్బంది ప్రాణభయంతో పరుగులు తీశారు. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేసింది. దీంతో త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. గుజరాత్ నుంచి తునికి టైల్స్ లోడుతో వెళ్లిన లారీ తిరిగి విజయవాడకు వస్తుండగా డీజిల్ కోసం దివాన్‌చెరువు పెట్రోలు బంకు వద్ద ఆగి డీజిల్ కొట్టించుకునే సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. లారీ క్యాబిన్ నుంచి షార్ట్ సర్క్యూట్ అవడంతో మంటలు ఒక్కసారిగా వ్యాపించాయి. ఈ ప్రమాదంలో లారీ ముందు భాగం పూర్తిగా కాలిపోయింది. క్యాబిన్‌లో ఉంచిన లారీకి సంబంధించిన రికార్డులు, రూ.15 వేల నగదు కాలి బూడిదైనట్లు డ్రైవర్ రింకూ చౌహాన్ తెలిపాడు.

రత్నగిరిపై ట్రాన్స్‌పోర్ట్ సేవలు అదుర్స్

- ఆదివారం ఒక్కరోజే రూ.1.50 లక్షల ఆదాయం
- అన్నవరం రైల్వేస్టేషన్–రత్నగిరికి తొమ్మిది బస్సు సర్వీసుల నిర్వహణ


రైల్వేస్టేషన్ వద్ద భక్తుల కోసం వేచియున్న దేవస్థానం బస్సులు

అన్నవరం: చాలా కాలానికి అన్నవరం దేవస్థానం ట్రాన్స్‌పోర్టు గాడిలో పడింది. దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ తీసుకున్న చర్యల కారణంగా కార్తికమాసంలో ఆదివారం ఒక్కరోజే అన్నవరం రైల్వేస్టేషన్ నుంచి రత్నగిరికి తొమ్మిది బస్సులు నడిపారు. దీంతో దేవస్థానానికి రికార్డు స్థాయిలో ఒక్కరోజే రూ.1.50 లక్షల ఆదాయం సమకూరింది.

గతంలో దేవస్థానం ట్రాన్స్‌పోర్టుకు ఏడు బస్సులు మాత్రమే ఉండేవి. వాటిలో కూడా ఒకటి రెండు బస్సులు మరమ్మతులకు గురై షెడ్డుకు పరిమితమయ్యేవి. మిగిలిన బస్సుల్లో నాలుగు బస్సులు మాత్రమే రైల్వేస్టేషన్ నుంచి రత్నగిరికి నడిపేవారు. కార్తికమాసంలో హైదరాబాద్, చెన్నై, విజయవాడ నుంచి అన్నవరం వచ్చే రైళ్లలో భక్తులు వేల సంఖ్యలో దిగుతారు. సత్యదేవుని దర్శనం అయ్యాక మరలా రైళ్ల ద్వారా తిరిగి తమ స్వస్థలాలకు చేరుకుంటారు. ఈ భక్తులకు సరిపడా బస్సులను నడపడంలో రత్నగిరి ట్రాన్స్‌పోర్టు విఫలమవడంతో భక్తులు ఆటోలను ఆశ్రయించేవారు. దీంతో ఆటో డ్రైవర్లు రైల్వేస్టేషన్ నుంచి రత్నగిరికి రూ.50 నుంచి రూ.70 వరకు వసూలు చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. దేవస్థానం బస్సుకు టికెట్ రూ.20 మాత్రమే. దీంతో భక్తులు దోపిడీకి గురవడంతో పాటు దేవస్థానం ఆ మేరకు ఆదాయం కోల్పోయేది. కాగా, దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ గత జూలై నెలలో రూ.80 లక్షలతో 40 సీట్లు కలిగిన రెండు కొత్త బస్సులను కొనుగోలు చేసి బాడీబిల్డింగ్ చేయించారు. అవి గత వారం దేవస్థానానికి చేరుకున్నాయి. దీంతో దేవస్థానంలో బస్సుల సంఖ్య తొమ్మిదికి చేరింది. వీటితో బాటు విజయవాడ దేవస్థానం నుంచి రెండు బస్సులను దేవస్థానానికి తీసుకువచ్చారు. దీంతో బస్సుల సంఖ్య 11కి చేరింది. వీటితో పాటు తిరుమల, ప్రకాష్, శ్రీశారదా విద్యాసంస్థలు ఆదివారం రెండేసి బస్సులను దేవస్థానంలో సేవకు పంపించాయి. విద్యాసంస్థలు పంపించిన బస్సులను రత్నగిరి–సత్యగిరి మధ్య నడిపారు. దేవస్థానం బస్సులను అన్నవరం రైల్వేస్టేషన్–రత్నగిరి, టోల్‌గేట్–రత్నగిరి మధ్య నడపడంతో భక్తులకు పది నిమిషాలకు ఒక బస్సు అందుబాటులోకి రావడంతో భక్తులు ఎక్కువ సేపు వేచియుండకుండా ప్రయాణించే వెసులుబాటు లభించింది. దీనికి తోడు పశ్చిమ రాజగోపురం వద్ద విశ్రాంతి షెడ్డు వద్దకే బస్సులు వస్తుండడంతో భక్తులకు మరింత సౌకర్యంగా ఉంది. ఈఓ కె.రామచంద్ర మోహన్ ఆదేశాల మేరకు కార్తికమాసమంతా 24 గంటలు దేవస్థానం ట్రాన్స్‌పోర్టు బస్సులు రైల్వేస్టేషన్, రత్నగిరి, టోల్‌గేట్ మధ్య నడిచేలా చర్యలు తీసుకుంటున్నట్లు ట్రాన్స్‌పోర్టు గుమస్తా బీఎస్ఎన్ రాజు తెలిపారు.


రత్నగిరిపై విశ్రాంతి షెడ్డు వద్ద బస్సుల కోసం వేచియున్న భక్తులు

రమ్య నర్సింగ్ స్కూల్‌లో వివాదం


నర్సింగ్ స్కూల్‌లో తనిఖీలు చేపట్టిన ఆర్డీవో మల్లిబాబు

కాకినాడ క్రైం: ఆదివారం కాకినాడ రమ్య నర్సింగ్ స్కూల్‌లో వివాదం చెలరేగింది. తమకు యాజమాన్యం మధ్యాహ్న భోజనం పెట్టలేదని పలువురు విద్యార్థులు నిరసనకు దిగారన్న ప్రచారం జరిగింది. దీంతో ఆర్డీవో మల్లిబాబు గాంధీనగర్‌లో ఉన్న రమ్య నర్సింగ్ స్కూల్‌లో తనిఖీలు చేశారు. విద్యార్థులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఆదివారం స్కూల్ మూసి వేసి తమకు భోజనాలు పెట్టలేదని ఫిర్యాదు చేశారన్నారు. ఫీజులు చెల్లించాలని ఒత్తిడి తెచ్చి నర్సింగ్ స్కూల్ మూసి వేశారన్నారు. ఈ విషయంపై యాజమాన్యాన్ని వివరణ కోరగా తమ వద్ద విద్య అభ్యసిస్తున్న పలువురు విద్యార్థులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్లు అందలేదని, అందుకున్న విద్యార్థులు ఫీజు చెల్లించలేదని, ఫీజులు చెల్లించకుండా స్కూల్ నిర్వహించడం కష్టతరమని అందువల్లే తాత్కాలిక మూసివేతకు నిర్ణయం తీసుకున్నామని యాజమాన్యం తెలిపిందన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్‌కు నివేదించామని మల్లిబాబు తెలిపారు. ఇకపై విద్యార్థులకు ఎటువంటి సమస్య రాకుండా జాగ్రత్త వహిస్తామని యాజమాన్యం హామీ ఇచ్చిందని అన్నారు.